# ఇంకెన్నాళ్ళీ వేదన

పొట్లూరి కోటేశ్వరరావ్

ప్రేమకు నిర్వచనం ఏమిటి?

ఇంత కాలం నా జీవితం ఆపదానికి అర్థం తెలుసుకోకుండానే గడిచిపోయింది పెళ్ళయ్యేక – ప్రేమంటే మరేం కాదు. కేవలం రెండు శరీరాల కలయిక. అందులో అంతకన్న ఇంకేం లేదు – అన్న భావన నాకు ప్రేమ గురించి తెలీనీకుండా చేసింది.

పుట్టి ఊహలు తెలిసిన దగ్గర్నుండీ తల్లిదండ్రుల ప్రేమ కూడా తెలియకుండానే పెరిగేను. అయితే అప్పట్లో ఆలేమిని ప్రేమగా అనుకోలేదు.

పెళ్ళీడు వచ్చిన దగ్గర్నుండి – పుస్తకాల్లోనూ సినిమాల్లోనూ ఉండే మధురమైన ప్రేమ నాకెన్నో అందమైన కలలు నేర్పింది. కానీ మా దారిద్ర్యం నా కలలన్నీ కల్లలు చేస్తూ, నన్నో రెండో పెళ్ళి వాడికి భార్యగా చేసింది. పెళ్ళికి ముందు రోజు రాత్రి – వెన్నెట్లో పెరట్లో నూతి గట్టు దగ్గర కూర్చుని తీయని ఊహలతో గడపవలసింది పోయి – ఎంతగానో ఏడ్చేను. నా అందమంతా అడవిగాచిన వెన్నెలవుతోందని బాధపడ్డాను. మా అమ్మ నన్ను ఓదార్చడం మినహా మరేం చేయలేకపోయింది. మా నాన్న నాకు పెళ్ళవబోతోందన్న ఆనందంలో మళ్ళీ పూర్తిగా తాగొచ్చి – నేనేడుస్తూండడం చూసి – చితకబాదేడు. జుత్తు పట్టుకుని గురగురా యీడ్చి ఇంట్లో పడేసి యీ పెళ్ళి చేసుకోకపోతే చంపేస్తానని బెదిరించేడు.

కొందరికి పెళ్ళి మధురస్వప్నమైతే – నాకు నిజమైన పీడకల.

పెళ్ళి కొందరి జీవితాలకి ఊపిరి పోస్తుందంటారు. కానీ యీ పెళ్ళితో నేను పూర్తిగా చచ్చిపోయిన దాన్నా అయేను. ఇరవయ్యేళ్ళకే నాలో ముప్పయ్యేళ్ళ స్త్రీ ఎదుగుదల వచ్చింది. ఆ విధంగా నాకూ నా భర్తకూ వయసులో రెండేళ్ళే తేడా!

పెళ్ళయిన కొత్తలో నా భర్తను చూస్తే నాకు విపరీతమైన కోపంగా ఉండేది. ఆయనో మాట్లాడాలంటే కూడా అసహ్యంగా ఉండేది. ఆయనేదేనా అడిగినా పుల్లు విరిచినట్టు సమాధానాలు చెప్పేదాన్ని. ఆయన కూడా నా కళ్ళలోకి సూటిగా చూడలేకపోయే వారెందుకో. నా కళ్ళలో "నిజం చెప్పండి... మీరు నాకు తగిన వారేనా?" అన్న భావం కదలాడుతూ ఉండేది. నా భర్త అందం కూడా అంతంత మాత్రమే. కేవలం ఒక మామూలు మనిషి. ఎవరితోనూ సరిగ్గా మాట్లాడలేని వాడిలా ఉంటారాయన. ఆయన ఓ ప్రభుత్వ ఆఫీసులో క్లర్క్. వచ్చే బొటాబొటీ జీతంతో ఎలాగో గడిచేది. నాకిది కావాలని నేనేనాడూ అడిగేదాన్ని కాదు. ఆయన మొదటి భార్య వలన పిల్లలు లేరు కాబట్టి సరిపోయింది.

మా ఇద్దరి కలయిక కూడా చాలా తక్కువే. ఈ పెళ్ళయిన మూడు నెలల కాలంలోనూ మేం శారీరకంగా కలసింది, కేవలం వేళ్ళ మీద లెక్క పెట్ట గలిగినన్ని సార్లు మాత్రమే. ఆ సమయాల్లో కూడా నేనొక కట్టెనే అవుతాను. ఆనందించవలసిన ఈ వయసునీ, కోరికలనీ కావాలని చంపేసుకున్నాను.

ఎవరి మీదనో చెప్పలేని కసి!

ఆయనే నా బాధలన్నిటికీ పరోక్షంగా కారకుడన్న అనుభూతి. అతన్ని చూస్తుంటే ఏదో దెయ్యాన్ని చూస్తున్న ఫీలింగ్. ఇదీ అని కారణం ప్రత్యేకంగా చెప్పలేను.

ఎన్నో...

ఎన్నెన్నో కారణాలున్నాయి ఆ భావనకి.

ఒకరోజు ఆఫీసులో పని చేస్తుంటే – టేబిల్ కింద కాళ్ళు ఉండిపోయి, వేళ్ళు బాగా నలిగిపోయేయి. కట్టు కట్టుకుని ఇంటికి వచ్చేరు. నా కెందుకో భలే సంతోషం వేసిందా రోజు. మూడు రోజుల వరకూ కట్టుతోనే ఉన్నారు. రోజూ కట్టు విప్పి, మందు రాసుకుని తిరిగి డ్రస్సింగ్ చేసుకునేవారు. నేను మొహమాటానికి కూడా "ఎలా ఉంది" అనడగలేదు.

ఉంటున్నది ఇంట్లో ఇద్దరమే అయినా– మాట్లాడుకునేది చాలా తక్కువ. "స్నానానికి నీళ్ళు పెట్టేను", "వడ్డించేసేను" లాటి పొడి మాటలే ఎక్కువ. ఆయనెన్నో మాట్లాడాలని చూసేవారని పించేది అప్పుడప్పుడు. కానీ నేనే నిర్దయగా ఆ అవకాశం ఇవ్వకుండా చేసేదాన్ని.

ఆయన ఉదయం తొమ్మిదిన్నరకి భోజనం చేసి, బయల్దేరేవాడు ఆఫీసుకి. ఆయన వెళ్ళగానే నేనూ భోజనం చేసేసి పడుకునేదాన్ని. తనతో పాటు భోజనం చెయ్యమన్నారు మొదట్లో. 'అంత తొందరగా అన్నం తినే అలవాటు లేదు' అని తప్పించుకున్నాను. అతనో కలిసి భోజనం చెయ్యడమంటే అదో అయిష్టం.

మధ్యాహ్నం నిద్ర లేచిన తర్వాత, ఏం తోచేది కాదు. పోనీ ఏదేనా పుస్తకం చదువుదామా అంటే అన్నీ నా బాధని రెట్టింపు చేసేవీ, లేదా గుర్తుకు తెచ్చేవీ. అందుకే అవి చదవ బుద్ధి కాదు.

బయట నిలబడి చూస్తే – సాయంకాలం జంటలు కలిసి వెళ్తుంటే ఎంతో అసూయగా ఉండేది. కొన్ని రోజులు ఆయన సాయంత్రం ఆఫీసు నుండి వచ్చే టైముకి – తలనిండా మల్లెపూలు పెట్టుకుని, నీట్‌గా తయారయి వీధి గుమ్మంలో నిలబడేదాన్ని.

అతని కోసం కాదు – కావాలనే!

ఆయన వచ్చి – ఎందుకలా వీధి గుమ్మంలో నిలబడతావ్, భోగందాన్లాగ – అని అంటాడేమోనని చూసేదాన్ని. అంటే గట్టిగా ఎదురు సమాధానం ఇవ్వాలని సిద్ధంగా ఉండేదాన్ని. కానీ ఆయన ఏమీ అనకుండానే లోపలకి వెళ్ళిపోయే వారు.

ఏదో వెలితిగా, అసంతృప్తిగా ఉండేది నాకు.

"సరదాగా అలా ఎక్కడికేనా వెళ్ళి రాలేక పోయేవా?" అని సున్నితంగా అడుగుతారు. నేను బదులు చెప్పలేకపోయేదాన్ని.

చుట్టుపక్కల ఇళ్ళలో ఉన్న స్త్రీలతో కూడా నా పరిచయం అంతం మాత్రమే. నా మట్టుకు నేను తలుపులు వేసుకుని ఉండడమే హాయిగా భావిస్తాను. ఎప్పుడేనా మరీ చికాకుగా ఉంటే ఒక్కర్తినీ సినిమా కెళ్తాను. ఓ రోజు మేట్నీ షో కెళ్ళేను. ఆయన ఆఫీస్ నుండి వచ్చేసరికి నేనింట్లో లేను. వీధి అరుగు మీదే కూర్చుని నేను వచ్చే వరకూ ఎదురు చూసేరు. నేను వచ్చేక ఆయన కళ్ళలో ఎందుకో చెప్పలేని ఆనందం. "హమ్మయ్య! వచ్చేసావా?" అన్నారు. "రాక ఏమవుతాను" అన్నాను చిరాగ్గా, అర్థంలేని ప్రశ్న అనుకుంటూ.

"నాకు ముందే చెప్పొచ్చుగా, నేను ఆఫీసు నుండి లేటుగానైనా వచ్చుండేవాణ్ణి" అని కసురుకుంటా రేమోననుకుంటే, అదేం లేదు.

అదేం మనిషో!

మా ఇంటి ఎదురుచ పోర్షన్లో ఉన్నాయన బాంకులో క్లర్కుగా పన్జేస్తున్నాడు. అతను, భార్యనీ పిల్లనీ ఎప్పుడూ ఎక్కడికో ఒక దగ్గరకి స్కూటర్ మీద తిప్పుతూనే ఉంటాడు. వాళ్ళని చూస్తే అసూయగా ఉండేది. అతని భార్య కూడా నా వయసు లేదా మరో రెండు మూడేళ్ళు ఎక్కువ ఉంటుంది. భర్త ఇంటికి రాగానే ఆమె ముఖంలో ఎంతో సంతోషం కనిపిస్తూ ఉంటుంది. వాళ్ళిద్దరూ ఎంతో అన్యోన్యంగా ఉంటారు. నేనెప్పుడైనా సాయంత్రం వీధి అరుగు మీదకి వస్తే – నా వేపు పలకరింపుగా చూసి నవ్వుతుంటుంది. నేను కూడా ఓ చిన్న చిరునవ్వు విసుర్తాను. అంతకన్నా పరిచయం పెంచుకునే ప్రయత్నం నేను

చెయ్యలేదు.

ఎందుకో ఆవిడ పలకరింపులో "అయ్యో. పాపం" అన్న సానుభూతి కనిపిస్తూంటుంది నాకు.

* * * *

రాజుని చూడగానే నా ప్రాణం లేచి వచ్చి నట్టయింది. తలుపులు తియ్యగానే అతను చిరునవ్వు నవ్వుతూ ఎదురుగా కనిపించేడు.

నా గుండెలు ఒకసారి లయ తప్పి తిరిగి మామూలుగా కొట్టుకోసాగేయి.

రాజు మా ఊళ్లో మా ఇంటి పక్కనే ఉండేవాడు. పెళ్లయి ఈ ఊరు వచ్చేసిన మూడు నెలల తర్వాత అతన్ని చూడ్డం మళ్లీ ఇప్పుడే.

నేను కాస్త చనువుగా ఎవరితోనన్నా మాట్లాడే దాన్నంటే, అది కేవలం రాజుతోనే. నాకు యీ పెళ్లి ఇష్టం లేదన్న సంగతి రాజుకి తెలుసు.

"ఏంటిలా ఊడిపడ్డావ్?.... మా ఇల్లెలా తెలిసింది నీకు?" ఆశ్చర్యంగా అడిగేను, లోపలకి ఆహ్వానిస్తూ.

"ఈ ఊళ్లో ఆఫీసు పనొకటి తగిలింది. ఎలాగూ వెళ్తున్నాను కదాని - మీ అమ్మగారి దగ్గర్నుండి నీ అడ్రస్ అడిగి తీసుకున్నాను..." అన్నాడు కుర్చీలో కూర్చుంటూ.

రాజు అందంగా ఉంటాడు. అతనీ మంచి ఉద్యోగమే. ఇంకా పెళ్లి కాలేదు. నన్ను సరిగ్గా అర్థం చేసుకున్నది అతనొక్కడేననిపిస్తుంటుంది నాకు.

"భోజనం చేసావా?... లేకపోతే పది నిముషాల్లో రెడీ చేసేస్తాను." అన్నాను.

"వద్దొద్దు. వస్తూనే దార్లో భోజనం చేసేను..." ఇల్లంతా కలయజూస్తూ అన్నాడు.


"అంతేనా?... లేక మా ఇంట్లో తినడం ఇష్టం లేక అలాగంటున్నావా?" అన్నాను, నొచ్చుకుంటూ.

"నీ చేతి వంట నాకు మాత్రం తినాలని లేదూ?...



## ఆటలు – అద్భుతాలు

### అతి ఎక్కువ క్యాచ్‌లు



ఒక టెస్ట్ మ్యాచ్‌లో ఎక్కువ క్యాచ్‌లు పట్టిన ఘనత 1974 లో ఆస్ట్రేలియన్ క్రీడాకారుడు గ్రెగ్ ఛాపెల్‌కు, 1977 లో భారతీయ క్రీడాకారుడు మజూర్వీంద్ర సింగ్‌కు దక్కింది. వారు ఏడు క్యాచ్‌లు పట్టారు.

DIST. BY ASIA FEATURES

అదో అదృష్టంలా భావిస్తాన్నేను. తెలుసా?" అన్నాడు.

"అయితే ఆ అదృష్టానికి సాయంత్రం నోచుకోకూడదూ?"

"తప్పకుండా, నువ్వు పిలవాలేగానీ నేను రానంటానా?" అన్నాడు నా కళ్ళలోకి చూస్తూ.

అతని మాటలు నాకు చాలా నచ్చేయి. ఈ మధ్య కాలంలో నేనింతగా మాట్లాడిందే లేదు. అప్పటికి టైమ్ రెండవుతోంది.

"అయితే కాఫీ పెట్టేదా?"

"ఓకె. ఎలా ఉంది జీవితం?" అదోలా అడిగేడు.

"మామూలుగానే ఉంది..." అంతకన్నా వివరంగా చెప్పడం నా వల్ల కాక వంటింటి వేపు నడిచేను. కాఫీ చేస్తున్నంత సేపు రాజు గురించే నా ఆలోచనలు. కాఫీ అందిస్తుంటే నా చేతులు తాకకూడదనుకుంటూనే అతన్ని తాకేయి.

"నా ఆఫీసు పని రేపటి నుండి ప్రారంభం.... ఈ రోజంతా ఏం చెయ్యాలో తోచడం లేదు... ఒకటే బోర్ కొడుతోంది... సినిమా కేదేనా పోతే ఎలా ఉంటుందా అని ఆలోచిస్తున్నాను."

"నువ్వొక్కడివేనా?... నేను కూడా వస్తాను."

"నువ్వా? ... మరి మీ ఆయనకు తెలిస్తే..." అర్థాంతరంగా ఆగిపోయేడు.

"ఏం తెలిస్తే?.. ఏం తప్పట అందులో?" ఆవేశంగా అన్నాను.

"అబ్బే. తప్పేం లేదు... నీకేం అభ్యంతరం లేకపోతే, పద...."

మరో పది నిముషాల్లో వీధి తలుపు తాళం వేసి రోడ్డు మీద పడ్డాం. వస్తూ వస్తూ ఎదురింటి వేపు చూసేను. ఆవిడ మమ్మల్నే కిటికీలోంచి చూస్తోంది.

నాకెందుకో గుండె ఝల్లుమంది. అయినా "చూడ్నీ. నాకేం" అనుకుంటూ నడవసాగేను.

దార్లో ఎన్నెన్నో కబుర్లు చెప్పేడు. టికెట్స్ అతనే తీసేడు. సినిమాలో అతని పక్కనే కూర్చున్నపుడు – లోలోన ఎందుకో సంచనలం. సినిమాలో అట్టే జనం

### ఇంకెన్నాళ్ళకి ఉదయం

కూడా లేరు. ఏవేవో జోక్స్ వేస్తూ నన్ను చాలా నవ్వించేడు. నా మనసులో ఉన్న గుబులంతా తాత్కాలికంగా దూరమైంది. ఆ మూడు గంటలూ మూడు నిముషాల్లా గడిచిపోయేయి. సినిమా వదిలేక

"ఇందూ! నువ్వు తిన్నగా ఇంటికెళ్ళిపో. నేను ఆఫీసు కెళ్ళి రేపుదయం వస్తున్నట్టుగా కబురు చెప్పాలి" అన్నాడు.

"అదేం?... మా ఇంటికి రావా?... మా ఆయన్ని పరిచయం చేస్తాను."

ఇప్పుడొద్దులే, తర్వాత చూద్దాం. రేపు సాయంత్రం వీలైతే మళ్ళీ నిన్ను కలుస్తాను. వీలైతే నువ్వే నా హోటల్‌కి రాకూడదూ?"

"అలాగే. ప్రయత్నిస్తాను."

"ప్రయత్నించడం కాదు. తప్పకుండా రావాలి." హోటల్ అడ్రస్ చెప్పేడు.

నేను రిక్షాలో ఇంటికి వచ్చేసరికి – ఆయన అరుగు మీద కూర్చుని ఉన్నారు.

"ఎంత సేపైంది మీరొచ్చి?" అనడిగేను తాళం తీస్తూ, ఈసారి డూప్లికేట్‌కి ఉన్న తాళం కొనాలని మనసులో అనుకున్నాను.

"ఇప్పుడే. ఓ పావుగంటై ఉంటుంది... సినిమా కెళ్ళావా?"

"ఆఁ. ఏం తోచక బోర్ కొడుతుంటే...." అంటూ వంటగది వేపు నడిచేను. రాజు వచ్చిన సంగతి చెప్దామనుకున్నదాన్నల్లా – ఏం అడ్డుపడిందో గానీ – చెప్పలేకపోయేను.

ఆయనకు ద్రోహం చేసానా? అన్న ఫీలింగ్ కొంచెం సేపు కలిగింది. ఆయన సైకిల్ లోపల పెట్టి బెడ్ రూమ్‌లోకి వెళ్ళినట్టున్నారు. మళ్ళీ నేనూ, నా వొంటరితనం మామూలే!

వంట మొదలెడుతుంటే ఆయన నా దగ్గరకు వచ్చి "మీ అమ్మ నాకుత్తరం రాసేరు..." అని లెటర్ అందించేరు.

ఉత్తరం చదివేను. మామూలు కబుర్లే. అక్కడంతా కులాసా. ఇక్కడ కులాసాయేనని తలుస్తున్నట్టూ, దసరా పండక్కి ఇద్దర్నీ తప్పకుండా రమ్మని రాసింది. చదివి పక్కనే పడేసాను.

"నీకు వెళ్ళాలనుంటే వెళ్ళు..." అని సలహా ఇచ్చేరాయన, వెళ్తూ.

"నాకేం అవసరం లేదు..." పెడసరంగా


కూపన్

ఆంధ్ర సచిత్ర వారపత్రిక

బైద్యనాథ్ ఆరోగ్య దీపిక


ప్రశ్న :................................................


..................................................

..................................................

పంపినవారి పేరు :

పూర్తి చిరునామా :




జవాబిచ్చేను.

* * * *

ఆ మరుచటి రోజు సాయంత్రం నాలుగు గంటలకి ఇంట్లోంచి బయల్దేరేను. ఎంత తొందరగా రాజుని చూద్దామా, అతన్తో మాట్లాడుదామా అని ఉంది. యథాలాపంగా ఎదురింటి వేపు చూసేను. మళ్లీ ఆవిడ కిటికీ దగ్గిర ప్రత్యక్షం. మొదటిసారిగా ఆవిడ మీద చాలా కోపం వచ్చింది నాకు. "ఈవిడకి వేరే పని లేదా?" అనుకుంటూ నడవసాగేను.

హోటల్ చేరుకుని ఎంక్వైరీలో రాజు ఉంటున్న రూమ్ గురించి అడిగేను. ఫస్ట్‌ఫ్లోర్లో అతని రూమ్. రూమ్ దగ్గరకు వెళ్లి తలుపు మీద శబ్దం చేసేను. అర నిముషంలో తలుపు తెరుచుకుంది.

"రా ఇందూ!" అని లోపలకి ఆహ్వానించేడు. నేను లోపలకి వచ్చాక తలుపులు దగ్గరగా వేసేడు.

"తలుపు లెందుకు వేస్తావ్?" అనడిగేను. ఏ మూలో అనుమానం.

"రూమ్ బాయ్స్ చూసారంటే బాగుండదు. అందుకని... ఏం తీసుకుంటావ్?... కాఫీ..."

"అదేం వద్దు గానీ. నీ ఆఫీస్ పని అయిందా?"

"ఈ రోజే పూర్తయింది. రాత్రికి బయల్దేరాలనుకుంటున్నాను."

'అదేం, మా ఇంటికి రావా?... మా ఇంట్లో నిన్ననే భోజనం చేయాల్సింది... అర్ధాంతరంగా వెళ్లిపోయేవ్. ఈ రోజు నిన్ను వదిలేది లేదు..."

"వదలొద్దు... గట్టిగా పట్టుకో ఇందూ..." అన్నాడు నా చేతి మీద చెయ్యి వేస్తూ.

నా గుండె ఝల్లుమంది.

"రాజూ ! ఏమిటిది?"

"కాదనకు ఇందూ!... నీ కోసమే నేనీ ఊరొచ్చిందసలు. నిన్ను చూడాలనీ, నీ దగ్గర గడపాలనీ నిన్ను ఇలా రమ్మన్నది... నా కోరిక కాదనకు. నిన్ను నాదానిగా చేసుకుంటాను. ఎలాగూ నీకు మీ ఆయన దగ్గర సుఖం లేదు."

చెంప ఛెళ్ళుమనిపించేను. ఎదురు తిరిగి ఇలా కొడతానని రాజు ఎన్నటికీ ఊహించి ఉండడు. అందుకే అతని కళ్ళు ఆశ్చర్యంతోనూ, కోపంతోనూ నా వేపు చూస్తున్నాయి.

నేను విపరీతమైన కోపంతో తలుపులు తీసుకుని గబగబ బయటికి వచ్చేసాను. రాజు గురించి నేను అనుకున్నదంతా తప్పు. అతను కూడా నా అంచనాలకి విరుద్ధంగానే ప్రవర్తించేడు. నేను కూడా రాజుతో ఎంత పొరపాటుగా ప్రవర్తించేనో అప్పటిగ్గానీ అర్థమవలేదు.

పైగా అతనన్న ఆఖరి మాటలు నన్ను మరింతగా అగాధంలోకి తోసేయి.

ఇదంతా కలలో లాగ జరిగిపోయింది. 'జరిగింది అబద్ధమైతే ఎంత బాగుణ్ణు' అనిపిస్తోంది.

వొళ్లంతా అదోలా అనిపిస్తోంది. నిలబడలేక పోతున్నాను కూడా. రోడ్డు మీద అందరూ నా వైపే చూస్తూ కేలి చేస్తున్నారేమోనన్న ఫీలింగ్. ఎలా ఇంటికి చేరుకున్నానో నాకే తెలీదు. బహుశా రోడ్డు మీద పరిగెత్తుతూ ఇంటికి వచ్చాననుకుంటాను.

ఇంటికి వచ్చేసరికి వీధరుగు మీద ఆయన కూర్చుని ఉన్నారు. తాళం ఆయన చేతుల్లో పెట్టి గోడకి చేరబడ్డాను.

ఆయన కళ్లలోకి సూటిగా చూడలేక – ఆయన తాళం తీస్తుంటే దొంగతనంగా ఆయన మొహం వేపు చూసేను. ఎంతో నిర్మలంగా, అమాయకంగా కనిపించేరు నా కళ్లకి మొదటిసారిగా.

లోపలకి వస్తూనే ఆయన గుండెల మీద పడి ఏడవాలనిపించింది, జరిగిన అవమానం తల్చుకుంటుంటే.

జరిగినదంతా ఆయనకు చెప్పెయ్యాలనీ, నా పొరపాటుకు మన్నించమని వేడుకోవాలనీ అనుకున్నాను.

కానీ నాకా అవకాశమియ్యకుండా బెడ్ రూమ్‌లో కెళ్లిపోయేరు.

ఈ తిరస్కారం నాకు మరింత మనస్తాపం కలిగించింది. కళ్లలో నీళ్ళు తిరుగుతున్నాయి. వొంట్లో నీరసం ఆవహిస్తోంది.

"నీ ఫ్రండ్‌ని భోజనానికి పిలవలేకపోయేవా?"

బెడ్‌రూమ్‌లోంచి ఆయనడిగిన ప్రశ్న, నిలబడలేక వంటింట్లో తలుపు పట్టుకుని జారిపోతుండగా వినిపించింది.

ఆ తర్వాతేమయిందో నాకు తెలీదు.

* * * *

కళ్ళు తెరిచి చూసేసరికి పక్కన స్టూల్ మీద కూర్చుని ఆయన కనిపించేరు. "ఎలాగుంది ఇందిరా?" అనడిగేరు నా కళ్లలోకి చూస్తూ. ఆయన కళ్లలో ఆందోళన స్పష్టంగా కన్పించింది. "బాగానే ఉందండీ..." నీరసంగా అన్నాను.

అప్పటికి నాకు హాస్పిటల్ వాతావరణం కొంచెం అర్థమయింది. చుట్టుపక్కల పేషెంట్స్ కూడా కొందరు మా వైపే చూస్తున్నారు.

జరిగిందంతా నాకు మళ్లీ గుర్తుకొచ్చింది.

"నాకేమైందండీ?..." కదలడానికి ప్రయత్నిస్తూ అడిగేను.

"ఏం లేదు ఇందిరా!... మొన్న సాయంత్రం ఇంటికి వచ్చిన తర్వాత – ఎందుకో వంటింట్లోంచి దబ్బున

శబ్దం వస్తే వెళ్ళి చూసేను. నువ్వు కిందపడిపోయి ఉన్నావ్.. వెంటనే నిన్ను ఇక్కడికి తీసుకు వచ్చేసేను. ఎదురింటి బ్యాంక్ ఆయన భార్య సావిత్రి నిన్నా - మొన్నా ఇక్కడే పడుకున్నాది... లేడీస్ వార్డ్ కదా... నాకు తెలిసిన వాళ్ళెవరూ లేరు, వాళ్ళు తప్ప... చాలా మంచావిడ...."

"ఎప్పుడు డిస్చార్జ్ చేస్తారు?..." అనడిగేను. నాకా వాతావరణంలో ఉండడం ఎంత మాత్రం ఇష్టం లేదు.

"ఈ రోజే డిస్చార్జ్ చేసేస్తామన్నారు... కేవలం వీక్‌నెస్ వల్ల వచ్చిందన్నారు డాక్టర్..." అని ఆయన బయటికి వెళ్ళేరు.

ఇంకా ఆయన మొహంలోకి చూడడానికి ధైర్యం చాలడం లేదు. ఆ రోజు నేను చేసిన పొరపాటు, ఇంత కాలం నేను ఆయన పట్ల ప్రవర్తించిన తీరు నాకు సిగ్గునీ, నాపై నాకే అసహ్యాన్నీ కలుగజేస్తున్నాయి.

ఆయన కాఫీ తీసుకు వచ్చేరు. కాఫీ తాగుతుండగా చెప్పేరు.

"ఆ రోజు రాత్రి నీ ఫ్రెండ్ రాజు కూడా మనింటికి వచ్చేరు..."

"దయచేసి ఆ విషయాల్ని గుర్తు చెయ్యకండి...

"సారీ ఇందిరా!... నిన్ను కష్టపెట్టాలన్న ఉద్దేశంతో చెప్పలేదు... ఆయన తన ప్రవర్తనకు సిగ్గుపడుతూ, క్షమించమని అడగడానికి వచ్చేరు..."

కానీ నేను క్షమించలేను ఎన్నటికీ.

* * * *

"రండి..." మంచం మీద నుండి లేస్తూ ఆహ్వానించేను సావిత్రిని.

"మీరు లేవకండి.." అని తను కుర్చీ దగ్గరకు లాక్కుని కూర్చుంది.

ఆవిడతో పాప కూడా వచ్చింది. ఆ పాపను మంచం మీదనే కూర్చోబెట్టింది.

"ప్రస్తుతం ఎలాగుంది?" అనడిగింది.

"మరేం చికాకు లేదు. నీరసం తప్ప..." అన్నాను పాప చేతిని చేతిలోకి తీసుకుంటూ.

ఆవిడని ఇంతకాలం దూరంగా చూడడమే. దగ్గరగా చూడడం ఇదే మొదటిసారి. ఆవిడకూడా అందంగానే ఉంది.

"నీపేరేంటమ్మా?" అనడిగేను పాపని.

"రాణి". పాపకి ఏడేళ్ళుంటాయి. కానీ వాళ్ళ నాన్నను చూస్తే కొత్తగా పెళ్ళయిన వాడిలా గుంటాడు. సావిత్రిని చూస్తే అలాగనిపించదు. ఎందుకో!

"చాలా థాంక్స్.... నేను హాస్పటల్‌లో ఉండగా చాలా ఇబ్బంది పెట్టేను మిమ్మల్ని.... " కృతజ్ఞతగా అన్నాను.

"ఇందులో శ్రమేముందండీ?.... " చిన్నగా నవ్వుతూ అంది.

మరేం మాట్లాడాలో తోచలేదునాకు. పాప ఏదో పుస్తకం చూస్తోంది. సావిత్రి ఇల్లంతా కలయ జూస్తోంది. ఇల్లంతా అపరిశుభ్రంగా ఉంది. నేనేనాడూ శ్రద్ధగా - పెళ్ళయేక - ఇల్లు సర్దిన పాపాన పోలేదు.... "ఎవరికోసం నీట్‌గా ఉంచుకోవాలి?" అన్న భావనే దానికి కారణం.

"చాలా రోజుల్నై, ఇల్లు సర్దుదామనుకుంటూనే బద్దకించేస్తున్నాను...." అని అబద్ధమాడేసేను.

"అవున్నండి.... అయినా ఎంత సర్దినా ఏదో ఒకటి ఇంకా వెలితిగానే ఉంటుంది." అందామె.

"మీ పెళ్ళయి ఎన్నేళ్ళైంది?" అనడిగేను.

"నాలుగు..." అన్చెప్పి, తనుకూడా టేబిల్ మీదనున్న పుస్తకం ఒకటి అందుకుంది.

అలాగా అని యధాలాపంగా అనేసి ఊరుకున్నాను, ఏదో ఆలోచిస్తూ.

కొంచెం సేపటికి గానీ నాకు తట్టలేదు. పెళ్ళయి నాలుగు సంవత్సరాలే అయితే ఏడు సంవత్సరాల కూతురెలా వచ్చింది? ఏదో సందేహం నాబుర్రలో కదిలింది. ఇదెలా సాధ్యం అనుకున్నాను మనసులో.

ఈ భావాలన్నీ నా మొహంలో కనిపించేయను కుంటాను. ఆవిడే అడిగింది.

"పెళ్ళయి నాలుగేళ్ళే అయితే, ఏడేళ్ళ పాపేంటని ఆలోచిస్తున్నారు కదూ?"

నేనేం సమాధానం చెప్పలేక పోయేను. తిరిగి ఆవిడే అంది.

"మా పెళ్ళి నాటికే నాకు మూడేళ్ళ కూతురుంది.... ఆయన పూర్తి సమ్మతితో నేనన్ను పెళ్ళాడారు...

నా మొదటి భర్త రోడ్ ప్రమాదంలో మరణించారు, పెళ్ళయిన సంవత్సరమే ..." చెప్పలేక చెప్పలేక చెప్పింది.

నాకంతా అర్థమైంది. ఆక్షణంలో సావిత్రి భర్త ఎంతో ఉన్నతుడిగా కనిపించేడు నాకళ్ళముందు. మధురమైన కలలన్నీ చిన్న వయసులోనే నాశనమయి, మోడుగా బతకవల్సిన ఆమె జీవితానికి తిరిగి ఓ గమ్యం అంటూ కల్పించాడు. ఆమె ఆశలకు ఊపిరి పోసేడు.... దెబ్బతిన్న ఆమెకు చేయూతనిచ్చి ఆదుకున్నాడు. దేముడిలాంటి మనిషి. చేతులెత్తి నమస్కరించాలనిపించింది ఆయనకి.

"ఏమిటాలోచిస్తున్నారు?" అడిగిందామె.

"ఏంలేదు.... క్షమించండి.... మీకు పాతజ్ఞాపకాలు గుర్తుచేసి బాధ కలిగించినట్టున్నాను". బాధపడుతూ అన్నాను.

"అదేం లేదండీ.... నా జీవితంలో తీరని అన్యాయం జరిగినా, ఆలోటు నాకేనాడూ రానివ్వకుండా మా ఆయనే చూసుకుంటున్నారు... నిజంగా నేన్నెంతో అదృష్టవంతురాల్ని....." అందామె.

నిజమే ననిపించింది నాకు.

ఇంతలో మా ఆయన రావడంతో 'మరి వెళ్ళొస్తాను' అని లేచింది.

"అప్పుడప్పుడు వస్తూండండి." ఆప్యాయంగా అన్నాను.

"అలాగే . మీరూ రావాలి...." అంది. అలాగే నన్నట్టుగ తలూపేను.

మాఆయన సైకిల్ లోపలపెట్టి, బెడ్‌రూమ్‌లోకి వచ్చి నన్ను చూసి–

"ఎలాగుంది?" అనడిగేరు.

"మరేంలేదు.... నీరసం కూడా తగ్గిపోయింది....." అన్నాను చిన్నగా నవ్వుతూ.

"వెరీగుడ్...." అన్నారు డ్రస్ మార్చుకుంటూ.

మా ఆయన్ని చూస్తుంటే ఎందుకో ఇప్పుడు చాలా ఇష్టం కలుగుతోంది. సావిత్రితో పోల్చుకుంటే, నాకొచ్చిన కష్టం ఏపాటిది?.... రెండో పెళ్ళి వాడికి భార్యనయానని. నన్ను నేను అనవసరంగా కించపరుచుకుంటూ, అతనికి కూడా తీరని ద్రోహం చేసానిన్నాళ్ళూ.

ఈ రోజునించీ ఆయనంటే నాకున్న పాత అభిప్రాయాలనన్నిటినీ దూరం చేసుకుంటున్నాను.... ఈ జీవితం ఆయనకే అంకితం.

ఆయన డ్రస్ మార్చుకుని బాత్‌రూమ్‌లో కెళ్ళేరు. నేను లేచి మంచందిగి, గూట్లో ఉన్న ఇన్‌లాండ్ లెటర్ పెన్ తెచ్చి మంచంమీద మళ్ళీ కూర్చుని రాయడం మొదలు పెట్టేను. ఇంతలో ఆయన వచ్చేరు, మొహం తుడుచుకుంటూ.

"ఇప్పుడేం అర్జంట్?.... తాపీగా రాసుకో కూడదూ?...." సున్నితంగా మందలిస్తూ అన్నారు.

"ఇప్పుడే రాయాలి...." చిలిపితనం మాటల్లో జోడించేను. ఆయనకి కూడా నా మాట తీరులో తేడా అర్థమయినట్టుంది. తుడుచుకోవడం ఆపి నావేపు చూసారొకసారి.

"మా అమ్మకు రాస్తున్నాను. ఈ దసరాకి మనం వెళ్తున్నాం మాఊరు...." అన్చెప్పేను.

ఆ మాటలు చాలనుకుంటాను, ఆయనకు పూర్తిగా అర్థమవడానికి. మెల్లగా నావద్దకు వచ్చి మంచం మీద కూర్చుని, నా చేతిలో చెయ్యి వేసేరు. నేనా చెయ్యిని గట్టిగా పట్టుకున్నాను–

"ఇంకెప్పటికీ వీడను....." అనుకుంటూ. □

## సత్యం

దూరాన దాగిన నక్షత్రాలు
ఎంత వెలుగు విరజిమ్మినా
కాంతి రాదు!
సమాజానికి స్ఫూర్తి యివ్వనిది
ఎంత వృద్ధివించినా
పనికి రాదు!

– అడిగోపుల వెంకటరత్నమ్